# వర్ధన్నపేట అభివృద్ధికి కలిసి పని చేస్తాం

## -కౌన్సిలర్ మాలోత్ దేవేందర్



**ఐనవోలు/ఫిబ్రవరి23(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మున్సిపాలిటీ 6వ వార్డు నూతన కౌన్సిలర్‌గా ఎన్నికైన మాలోత్ దేవేందర్, తమ వార్డుతో పాటు మున్సిపాలిటీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో భాగంగా ఆయన, మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావును హనుమకొండ జిల్లా, ఐనవోలు మండలంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా కౌన్సిలర్ దేవేందర్, రవీందర్ రావును శాలువాతో ఘనంగా సన్మానించి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై సీనియర్ నాయకులైన రవీందర్ రావుతో ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో జెత్య నాయక్, వెంకన్న, చందులాల్, రవి, యాకు, రాజేందర్, డి.సి. తండా నాయకులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సిపిఎస్ ఉద్యోగుల డిఏ ఏరియర్స్ ఒకేసారి విడుదల చేయాలని నిరసన.




**బయ్యారం/ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండలంలోని గంధంపల్లి ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో సిపిఎస్ ఉద్యోగుల డిఏ ఏరియర్స్ ఒకేసారి విడుదల చేయాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీఎస్ సిపిఎస్ఈయూ బయ్యారం మండల అధ్యక్షులు భానోత్ రవీందర్,ప్రధాన కార్యదర్శి గలిగ దస్తగిరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రావలసిన 121 డిఏ ఏరియర్స్ ను ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.దాదాపు 30 నెలలు కావస్తున్న పిఆర్సిపై ఎటువంటి స్పష్టత లేకపోవడం చాలా దురదృష్టకరమని అన్నారు. ఉద్యోగులకు రావలసిన బకాయిలను తక్షణమే విడుదల చేయకపోతే దశల వారీగా ధర్నాలు చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో సునీల్, వీరన్న నాయక్,బద్రి,గుగులోతు రవీందర్,మోహన్,సరస్వతి,చిరంజీవి, బాలాజీ,రాజా,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ, మానవతా విలువలే

## విద్యార్థుల విజయానికి సోపానాలు : శ్రీ మాణిక్యరావు





**వర్ధన్నపేట/ఫిబ్రవరి 23జర్నలిస్ట్ వార్త):**
క్రమశిక్షణ జీవితానికి రక్షనిస్తుంది, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే మానవతా విలువలు పెంపొందించుకోవాలి అని స్వచ్ఛంద సామాజిక సేవా కార్యకర్త, ఉత్తమ అవార్డు గ్రహీత మాణిక్యరావు అన్నారు. వర్ధన్నపేట మండలం, ఇల్లంద గ్రామంలోని శ్రీ కాకతీయ యూపీఎస్ స్కూల్‌లో ఆదివారం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షతన మానవతా విలువలు, లక్ష్యం, క్రమశిక్షణ అనే అంశంపై అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాణిక్యరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, చదువుతో పాటు క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం, దేశభక్తి ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు. మనమందరం దేశం కోసం బతకాలి, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు కష్టాన్ని ఇష్టంగా మార్చుకోవాలన్నారు.
ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి పాటలు, పర్యావరణ పరిరక్షణను చాటిచెప్పే నాటికలతో మానవతా విలువలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, మనం రాక్షస గుణం నుండి మానవత్వానికి, అహంకారం నుండి దైవత్వానికి మారాలి. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువుతోనే సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం. సాయిలు, సదాశివుడు, కె. అరవింద్, సురేష్, ఇల్లయ్యలతో పాటు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం

**రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచన**





**భీమదేవరపల్లి/ఫిబ్రవరి23 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్) కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 125 మంది రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. సోమవారం కొత్తపల్లి రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి పద్మ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి క్రిసోలైట్, సీఆర్పీ మంద సుజాత, కొట్ట రేణుకలు పాల్గొని ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత, రసాయన రహిత సాగు విధానాలు, పంటల ఉత్పాదకత పెంపు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులను కాత రూపా వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లి ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ద్రవ జీవామృతం తయారీ విధానం, దాని వినియోగం, ప్రయోజనాల గురించి ప్రత్యక్షంగా చూపిస్తూ శిక్షణ అందించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవడంతో పాటు రైతుల ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని అధికారులు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరణలో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పద్మ, వ్యవసాయ విస్తరణ అధికారి క్రిసోలైట్, సీఆర్పీ మంద సుజాత, కొట్ట రేణుక, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనలో యువత ముందడుగు

## కట్రియాలలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక






**వర్ధన్నపేట/ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త);**
వర్ధన్నపేట మండలం కట్రియాల గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా కొండేటి భాస్కర్, ఉపాధ్యక్షులుగా ముత్యాల భాస్కర్, గౌరవ అధ్యక్షులుగా ముత్యాల రమేష్‌ను ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా ముత్యాల బాబు, కార్యదర్శిగా తాటిగాల రాజు, కోశాధికారిగా ముత్యాల శ్రీధర్ బాధ్యతలు చేపట్టారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా దుప్పల్లి రాజు, ఎలుకట్టే రాజు, నస్కూరి మహేందర్, ఎలుకట్టే సతీష్‌లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొండేటి భాస్కర్ మాట్లాడుతూ కులాల పునాదుల మీద సమాజాన్ని నిర్మించలేమన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా మేము పనిచేస్తాం. సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను తొలగించడంలో అంబేద్కర్ చూపిన బాటలో నడుస్తూ, నవ సమాజ భారత నిర్మాణంలో మావంతు కృషి చేస్తాం అని స్పష్టం చేశారు.సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సీనియర్ నాయకులు ముత్యాల దీపక్, దుప్పెల్లి అశోక్, ఇరుగు శ్రవణ్, ఇరుగు విజయ్, ముత్యాల మదన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో నేలకొరిగిన మొక్కజొన్న పంటల పరిశీలన.





**బయ్యారం/ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండలంలోని బీరోని మడవ,రెడ్యాతండా,జగత్రావుపేట గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి కే.రాజు క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు.ఆదివారం వీచిన భారీ గాలులతో మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం జరిగి పంటలు నేలకూలి పంట దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు.ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 180 ఎకరాల మేర మొక్కజొన్న పంట నష్టం జరిగినట్లు గుర్తించారు.ఈ మేరకు పంట నష్టం వివరాలను సేకరించి కమిషనర్ కార్యాలయానికి నివేదిక పంపిస్తామన్నారు.ఈ సందర్భంగా రైతులు ఆత్మవిశ్వాసంతో ఉండాలని,వ్యవసాయ శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని తెలియజేశారు.ఈ పర్యటనలో వ్యవసాయ విస్తరణ అధికారి ఫయాజ్,జగత్రావ్ పేట సర్పంచ్ మోహన్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సేవా పథంలో వైరా 20వ వార్డు కౌన్సిలర్

## : విద్యార్థులకు బాగులు, దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేత





**వైరా/ఫిబ్రవరి 23 (జర్నలిస్ట్ వార్త):** వైరా మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి, ఉంద్రు శ్యాంబాబు దంపతులు మానవత్వంతో కూడిన సేవా కార్యక్రమాలను చేపట్టి అందరి ప్రశంసలు అందుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, ప్రముఖులు డాక్టర్ కాపా మురళీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరైన ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. శాంతినగర్ ఎస్టీ కాలనీ తండాలోని ఎం.పి.పి.ఎస్ పాఠశాల విద్యార్థులకు కౌన్సిలర్ దంపతులు పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, “పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు విద్యే బలమైన మార్గమని, వారి విద్యాభ్యాసానికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని“ భరోసా ఇచ్చారు. శారీరక వైకల్యంతో ఇబ్బంది పడుతున్న కేలోత్ చంద్రు అనే వ్యక్తికి, కౌన్సిలర్ దంపతులు వీల్ చైర్‌ను అందజేసి, అతని జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ, రాబోయే ఐదు సంవత్సరాల కాల పరిధిలో 20వ వార్డును అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. “పేదల సేవయే పరమావధిగా, వార్డు అభివృద్దే? లక్ష్యంగా తమ ప్రయాణం కొనసాగుతుందని“ ఉంద్రు వరలక్ష్మి, శ్యాంబాబు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ రెడ్డి, స్థానిక నాయకులు వంకాడోత్ బిక్య, గుగులోత్ లక్ష్మి బాయి, ఎస్.కె. రహీం (పండు), తేజవత్ నాగేశ్వరరావు, గడసందుల దర్గయ్య, కొర్ర వెంకటేశ్వర్లు, బానోత్ కృష్ణ బాబు, తేజవత్ బాలమ్మ, వంకాడోత్ మని, భూక్యా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారం కేటీఆర్ సేన మండల ఇంచార్జ్ గా దావా శ్రీకాంత్



**బయ్యారం/ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండల కేటీఆర్ సేన మండల ఇంచార్జ్ గా దావా శ్రీకాంత్ ని నియమించినట్లు కేటీఆర్ సేన మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు తరుణ్ నాయక్ సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా దావా శ్రీకాంత్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నన్ను మండల ఇంచార్జ్ గా అవకాశం కల్పించిన కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్, కేటీఆర్ సేన మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు తరుణ్ నాయక్ కీ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాత గణేష్, మండల యూత్ అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్ నాయక్ కీ కృతజ్ఞతలు తెలియజేశారు. బయ్యారం మండల వ్యాప్తంగా కేటీఆర్ సేనను బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం,కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును పూర్తిగా ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్తూ రెండు పార్టీలు తెలంగాణకు చేస్తున్న ద్రోహన్ని ప్రజలకు తెలియజేస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలు,420 హామీలు నెరవేర్చేదాక ప్రజల్లో ఎప్పటికప్పుడు నిలదీస్తామన్నారు. తెలంగాణ రైతాంగానికి పూర్తిస్థాయిలో రుణమాఫీ అయ్యేవరకు రైతు భరోసా అందరి రైతులకు అందే వరకు మా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

